పరిహారానికి ఎదురుచూపులు

- నిండా మునిగినా పరిహారం అందలేదంటూ ఆవేదన
- జాబితాలో అర్హుల పేర్లు గల్లంతు
- బుడమేరు ముంపు బాధితుల గగ్గోలు


మంతెనలో బుడమేరు ముంపుతో కూలిపోయిన రేకుల షెడ్డు

కంకిపాడు: బుడమేరు ముంపు బాధితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోయినా తమ పేర్లు అర్హుల జాబితాలో లేవని వాపోతున్నారు. ఇళ్లు మునగని వాళ్లకీ పరిహారం అందిందని, తమకు మాత్రం అన్యాయం జరుగుతోందని విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

బుడమేరు వరద ఉధృతితో మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాలు అల్లాడిపోయాయి. రెండు వారాలకు పైగా వరదనీరు ఇళ్లను చుట్టుముట్టడంతో కనీసం రోడ్లపై సంచరించే పరిస్థితి లేదు. ప్రధానంగా ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాలపై తీవ్ర ప్రభావం పడింది. పంట పొలాలతోపాటు ఇళ్ల చుట్టూ నీరు నిలిచిపోయి అవస్థలు పడ్డారు.

1,658 గృహాలపై ప్రభావం

ముంపు గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వే ఆధారంగా 1,658 గృహాలు ముంపు బారిన పడ్డాయి. రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. ఈనెల 26వ తేదీ నుంచి వరద ముంపు ప్రాంత వాసులకు పరిహారాన్ని జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పేర్లు లేవంటూ గగ్గోలు

ముంపు బాధిత లబ్ధిదారుల జాబితాలో పేర్లు తారుమారయ్యాయి. నిండా మునిగి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారి పేర్లు కొన్ని గల్లంతయ్యాయి. ప్రభుత్వం అందించిన రేషన్ సరుకులు సక్రమంగా అందినా, పరిహారంగా ఇచ్చే రూ. 10 వేలు తమ బ్యాంకు ఖాతాలో జమకాలేదని వాపోతున్నారు. ముంపు ప్రభావం చూపని వాళ్లకూ, పక్కా ఇళ్లల్లో ఉన్న వారికీ పరిహారం అందడంపై విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా ఉన్న అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు సర్వే సిబ్బంది తలొగ్గి వ్యవహరించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జాబితాల్లో పేర్లు లేకపోవడంతో సచివాలయం, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

సాంకేతిక సమస్యలు మరో కారణం

పేర్ల తారుమారుతోపాటుగా, సాంకేతిక సమస్యలు మరో కారణంగా కనిపిస్తున్నాయి. బాధితుల ఆధార్ నంబర్ బ్యాంకు లింకేజీ ఆధారంగా పరిహారం సొమ్ము విడుదల చేశారు. అయితే ఇంటి పేర్లు మార్పు జరిగినా, ఆధార్ అనుసంధానం కోసం బ్యాంకును సంప్రదించాలంటూ ప్రభుత్వం తరఫున మెసేజ్‌లు వస్తుండటంతో గందరగోళానికి గురవుతున్నారు. ఎంతో కాలంగా తాము బ్యాంకు ఖాతాలు వాడుతున్నామని, ఇదెక్కడి తిరకాసు అంటూ మండిపడుతున్నారు. పరిహారం అందించి అండగా నిలవాలని బాధితులు వేడుకుంటున్నారు.

మా గోడు పట్టించుకోవడం లేదు



మేము గుడిసెలో ఉంటున్నాం. బుడమేరు ముంపుతో రెండు వారాలు పునరావాస కేంద్రంలో ఉన్నాం. రేషన్ సరుకులు అందినాయి. ఇప్పటికీ ఇంట్లో చెమ్మ పోలేదు. వరద తగ్గినా ఇంట్లో సామగ్రి మొత్తం పనికి రాకుండా పోయింది. ఏ రోజు కారోజు పని చేసుకుంటే తిన్నట్లు.. లేకపోతే లేదు. మాకు ప్రభుత్వం నుంచి పరిహారం రాలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.

– పెనుమాక వేళంగణి, మంతెన

ఇల్లు కుంగిపోయింది



మా అబ్బాయిది, నాది రెండు కుటుంబాలు ఒకే ఇంట్లో ఉంటున్నాం. వరద నీరు ఇంటి చుట్టూ చేరి ఇల్లు కుంగిపోయి దెబ్బతింది. రెండు కుటుంబాలు ఉంటే ఒక్కటే రేషన్ కిట్ ఇచ్చారు. పరిహారం కూడా అంతే. ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నా కనికరం లేదు. ఇంట్లో ఉండలేని పరిస్థితి. మాబోటి పేదవాళ్లను పట్టించుకోవడం లేదు. గ్రామంలో అర్హత లేకపోయినా కొందరికి పరిహారం వచ్చింది. మాకు మాత్రం అన్యాయం చేస్తున్నారు.

– తిరువీధుల పండు, మంతెన

ప్రభుత్వం ఆదుకోవాలి



మేము ముగ్గురం. వరదకి ఇల్లు ముంపు బారిన పడింది. ఇంట్లో సామాన్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఇచ్చే సాయం ఎప్పుడు వస్తుందా? అని చూస్తున్నాం. ఇంటి అవసరాలకు ఆ సొమ్ము ఉపయోగపడుతుందని అనుకున్నాం. మా కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నా.

– టి. అమ్ములు, మంతెన

ఏ ఒక్కరినీ వదలకుండా నమోదు చేశాం

వరదతో ముంపు బారిన పడ్డ ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేయించాం. కొన్ని సాంకేతిక కారణాలు, ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు ఉండటం, ఇతరత్రా కారణాలతో కొన్ని పేర్లు రిజక్ట్ అయ్యాయి. వాటిని సరి చేసి పంపుతున్నాం. వరద బాధితులు నష్టపోకుండా రెవిన్యూ యంత్రాంగం అండగా నిలబడింది.

– వి. భావన్నారాయణ, తహసీల్దార్, కంకిపాడు

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ

గన్నవరం: గన్నవరం సబ్‌రిజిస్ట్రార్‌గా వివివి. ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన కె. వెంకటేశ్వరరావు గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్–2గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్–1 ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు కె. వెంకటేశ్వరరావు నుంచి ప్రసాద్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సబ్‌రిజిస్ట్రార్‌ను కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్, పక్కన బదిలీపై వెళ్తున్న సబ్‌రిజిస్ట్రార్

పేరంటాలమ్మ ఆలయ ఈఓగా ప్రియాంక

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా ప్రియాంక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా ఉన్న పి. లోకేశ్వరి మాచవరంలోని దాసాంజనేయ స్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ప్రియాంకకు పేరంటాలమ్మ ఆలయంతోపాటు ఎనికేపాడు శ్రీ సీతారామస్వామి ఆలయం, నిడమానూరులోని రాజరాజేశ్వరస్వామి ఆలయానికి కూడా ఈఓగా బాధ్యతలు అప్పగించారు.

యనమలకుదురు ఆలయ ఈఓగా భవాని


యనమలకుదురు ఆలయ ఈఓగా బాధ్యతలు తీసుకుంటున్న భవాని

పెనమలూరు: యనమలకుదురు శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఎస్.భవాని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఈఓగా పని చేస్తున్న ఎం. గంగాధరరావు నందిగామ శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామివారి దేవస్థానం ఈఓగా పని చేస్తున్న ఎస్. భవాని బదిలీపై శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, గ్రూప్ దేవాలయాల ఈఓగా వచ్చారు.

సామాజిక సేవలు అభినందనీయం

కంకిపాడు: సామాజిక సేవా కార్యక్రమాల్లో దాతలు, ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో హడ్కోసంస్థ వితరణతో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. సంస్థ జాయింట్ జనరల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్, సీనియర్ మేనేజర్ టి.సుబ్బారావు, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సంజయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా రాజా, ఆసుపత్రి మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, టీడీపీ నేతలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో వ్యవహరిస్తేనే ఉన్నతి

ఆర్‌ఐపీఈ షేక్ మహబూబ్ బాషా

కంకిపాడు: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో వ్యవహరిస్తేనే ఉన్నతి సాధ్యమవుతుందని రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో అండర్–14, 17 బాలురు, బాలికల కబడ్డీ పోటీలు, క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని తెలిపారు. వ్యాయామ విద్యలో టెక్నాలజీ అంశంపై విద్యార్థులకు విశదీకరించారు. మండల క్రీడాధికారి ఎం.హరిగోపాల్, సబ్ జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భవాని, వై. మురళీ, పెనమలూరు సబ్‌జోన్ కోఆర్డినేటర్ రమణ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

స్కూల్ గేమ్స్ మండల స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14 బాలికల కబడ్డీ విజేతగా కోలవెన్ను జెడ్పీ పాఠశాల, రన్నర్స్‌గా కంకిపాడు జెడ్పీ పాఠశాల నిలిచాయి. అండర్–17 బాలికల విభాగంలో కంకిపాడు జెడ్పీ విజేతగా, రన్నర్‌గా కోలవెన్ను జెడ్పీ పాఠశాల విద్యార్థులు నిలిచారు. అండర్–14 బాలుల విభాగంలో జెడ్పీ పాఠశాల కంకిపాడు విజేతగా, రన్నర్స్‌గా శ్రీచైతన్య పునాదిపాడు విద్యార్థులు నిలిచారు. అండర్–17 బాలుర విజేతగా శ్రీచైతన్య పునాదిపాడు, రన్నర్స్‌గా మంతెన జెడ్పీ పాఠశాల నిలిచాయి.


బాలికల అండర్–14 కబడ్డీ విజేతగా నిలిచిన కోలవెన్ను జెడ్పీ విద్యార్థినులు

కృష్ణానదిలోకి కలుషిత నీరు

నిర్ధారించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

పెనమలూరు: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి కలుషిత నీరు పవిత్ర కృష్ణానదిలోకి వదులుతున్నారని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిర్ధారిస్తూ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రామలింగేశ్వరనగర్‌లో 20 ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఉంది. ఈ ప్లాంట్‌లో మురుగునీరు శుద్ధి చేసి అనంతరం వృధా నీటిని కృష్ణానదిలోకి నేరుగా వదులుతున్నారు. అయితే సీవేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ కారణంగా ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్థానిక నివాసితులు ఆందోళన చెందుతున్నారు. నదిలోకి వ్యర్థాలతో ఉన్న నీరు ప్లాంట్ నుంచి విడుదల చేయడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి విడుదల అవుతున్న వ్యర్థాలతో ఉన్న నీటిలో దిగిన పలు పాడి గేదెలు కూడా మృత్యువువాత పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన వెలగపూడి బాబూరావు గ్రీన్ ట్రిబ్యునల్‌లో(ఎన్‌జీటీ) కేసు వేశారు. దీనిపై ఎన్‌జీటీ వాస్తవాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీ కంట్రోల్ బోర్డును ఆదేశించింది. అయితే గత ఆగస్టు 9వ తేదీన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తనిఖీ చేసి శాంపిల్స్ తీశారు. ఎనాలసిస్ నివేదిక ప్రకారం సీవేజ్ ప్లాంట్ నుంచి విడుదలవుతున్న నీటిలో ఉండాల్సిన ప్రమాణాల కన్నా టోటల్ డిస్సాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్)బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడి) ఎక్కువగా ఉన్నాయని గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పించారు. ఈ వ్యవహారంపై గ్రీన్ ట్రిబ్యునల్ ఇవ్వనున్న తుది ఆదేశాలపై స్థానికులు ఎదురుచూస్తున్నారు.


సీవేజ్‌ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

పంచలోహ ఉత్సవ విగ్రహం వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కనకదుర్గమ్మ ఆలయానికి దాతలు పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని శుక్రవారం బహూకరించారు. కోడూరుపాడుకు చెందిన వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు, తాతారావుస్వామి, కంకిపాడుకు చెందిన శివకుమార్, వీరవల్లికి చెందిన చక్కా ఫణి విరాళాలతో ఆలయంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల చేతులమీదగా ఉత్సవ విగ్రహానికి ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శాంతి హోమం చేశారు. అనంతరం అమ్మవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాష్, అయ్యప్ప, భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహంతో దాతలు చందు శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు

క్రీడా పోటీలకు 36 మంది విద్యార్థులు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్–14 కేటగిరిలో 19 మంది, అండర్–17లో 17 మంది విద్యార్థులు వివిధ క్రీడాజట్లకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. గన్నవరంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో ఈ విద్యార్థులు బాపులపాడు మండల జట్లకు ప్రాతినిథ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.


క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వరద బాధితులకు రూ. 1 లక్ష సాయం

ఉయ్యూరు: వరద బాధితుల సహాయార్థం ఉయ్యూరు ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ. 1 లక్ష సాయం అందించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులను లోకేష్ అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న విద్యార్థులు

విజయవాడ రూరల్‌లో వీఆర్వోల బదిలీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పలువురు గ్రామ రెవిన్యూ అధికారులు(వీఆర్వోలు) బదిలీ అయ్యారు. నున్న సచివాలయం–2కి సీహెచ్ గోపాలకృష్ణ, నున్న సచివాలయం–1 బి. రంగరావు, జక్కంపూడికి పి.గోపి బదిలీ అయ్యారు. రామవరప్పాడుకి షేక్ బాజీ, కొత్తూరు తాడేపల్లికి ఎస్.చక్రధర్‌రావు, ప్రసాదంపాడుకు బి.పవన్‌కుమార్, దోనేఆత్కూరు వీఆర్వో ఎం. అన్నపూర్ణను గన్నవరం బదిలీ చేశారు. ఎనికేపాడుకు ఎస్.సత్యవతి, పైడూరుపాడుకు రమేష్ నాయుడు, గొల్లపూడికి జి.దుర్గారావు బదిలీ అయ్యారు.

పెనమలూరు: పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం పరిధిలోకి మరో ముగ్గురు వీఆర్వోలు బదిలీపై వచ్చారు. విజయవాడ సెంట్రల్ నుంచి పెదపులిపాక గ్రామానికి డి.సుధీర్, కంకిపాడు నుంచి కానూరు సచివాలయం–3కి ఎస్.మాధురిదేవి, కంకిపాడు నుంచి పోరంకి సచివాలయం–3కి కె.ఏడుకొండలు వీఆర్వోలుగా బదిలీ అయ్యారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

కంకిపాడు: అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరమని కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్, జేఏసీ మాజీ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు, అభివృద్ధి చేరువ కావాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందరి సమన్వయంతోనే ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సాంకేతిక విద్య

ఉయ్యూరు: ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్రశిక్ష రాష్ట్ర సహిత విద్య కోఆర్డినేటర్ అన్నపూర్ణ అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం భవిత కేంద్రాల్లో బోధించే సహిత విద్య ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. అన్నపూర్ణ మాట్లాడుతూ నూతన విద్యాబోధనతో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. ట్యాబుల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని బోధన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కె.రాములు, కోఆర్డినేటర్లు వనజ, రాంబాబు, ఎంఈఓ–2 సుధారాణి, పర్యవేక్షకులు నరసింహ, రీసోర్సు పర్సన్‌లు సునీల్, మహాలక్ష్మి, వీరయ్యనాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



గన్నవరం: ఇటీవల బుడమేరు వరదల వల్ల ముంపునకు గురైన విజయవాడ, కైకలూరు తదితర ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులకు శ్రీ వైఖానస యూత్ ఫోరం అండగా నిలిచింది. దావాజీగూడెంలోని శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం 120 బ్రాహ్మణ కుటుంబాలకు యూత్ ఫోరం గన్నవరం శాఖ అధ్యక్షుడు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు వల్ల నష్టపోయిన బ్రాహ్మణ కుటుంబాలను గుర్తించి తమవంతుగా సాయం నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. ఫోరం సహాయ అధ్యక్షుడు ఆర్. వెంకటచార్యులు, కార్యదర్శి ఎం. మారుతి, కోశాధికారి ఎం. రామకృష్ణ, పలువురు ఫోరం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే



పెనమలూరు: ఆర్టీసీ చైర్మన్‌గా నియమించిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పెనమలూరు మండల టీడీపీ అధ్యక్షుడు కోయా ఆనంద ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, సీనియర్ టీడీపీ నాయకుడు మారుపూడి ధనకోటేశ్వరరావు తదితరులు కొనకళ్లను ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు.

పర్యావరణ హితమే అందరి లక్ష్యం

కంకిపాడు: పర్యావరణ హితమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజ్, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన కంకిపాడులో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన చేశారు. ర్యాలీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కడియాల రవి, కార్యదర్శి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎగ్జిబిషన్



కంకిపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఈఓ కె. ప్రసాద్ సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేస్టు టు ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు వ్యర్థాల నుంచి అద్భుతమైన కళాకృతులు రూపొందించి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ప్రదర్శనలో నెప్పల్లి, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలు ప్రథమ, ద్వితీయ స్థానాలను, పునాదిపాడు, గొడవర్రు జెడ్పీ పాఠశాలలు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. హెచ్‌ఎం పద్మావతి, మండల ఆర్గనైజర్ పీఎస్ ప్రసాద్, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం విడుదల

విజయవాడరూరల్: వరద ముంపునకు గురైన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి బి. రంగనాథ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,766 ఎకరాల్లో వరిపంటకు నష్టం ఏర్పడిందని అందుకుగానూ 906 మంది రైతులకు రూ. 2.91 కోట్ల నష్టపరిహారం విడుదల అయిందని పేర్కొన్నారు. గూడవల్లి గ్రామంలో 74 మంది, నిడమానూరులో 145 మంది, దోనేఆత్కూరులో 81, ఎనికేపాడులో 103, రామవరప్పాడులో 37, ప్రసాదంపాడులో 27, నున్నలో 211, పాతపాడులో 111, పి.నైనవరంలో 61, అంబాపురం గ్రామంలో 56 మంది బాధిత రైతులు ఉన్నారని తెలిపారు.

నేడు పోరంకిలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: పోరంకి శ్రీవసంత వేణుగోపాల స్వామివారి దేవస్థానంలో శనివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ యువజన నాయకుడు అద్దేపల్లి చందు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పెనమలూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్రీడా పోటీలు వాయిదా

గన్నవరం: వర్షాల కారణంగా స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జరగాల్సిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు వాయిదా పడినట్లు నియోజకవర్గ క్రీడల ఇన్‌ఛార్జ్ సిహెచ్. చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నుంచి వర్షం పడటంతో గ్రౌండ్ క్రీడల నిర్వహణకు అనుకూలంగా లేదన్నారు. వర్ష ప్రభావం తగ్గగానే ఆటల పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు శుక్ర వారం తెలిపారు. ఈ పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన బాలబాలికలు పాల్గొంటారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. చల్లపల్లికి చెందిన జగ్గారపు నాగవిజయగౌరి పిల్లల చదువు కోసం కంకిపాడుకు వచ్చి అద్దె ఇంట్లో నివశిస్తుంది. ఆమె భర్త దుబాయ్‌లో పని చేస్తాడు. కాగా ఆమె గురువారం సాయంత్రం వాకింగ్ చేస్తూ గోసాల ఫ్లెక్టోవర్ వద్ద బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కంకిపాడు వైపునకు వెళ్తున్న బైక్ వేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె కాలు, చేయి విరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన ఇరువురిపై కేసు

పెనమలూరు: వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. యనమలకుదురు జన్మభూమి వంతెన వద్ద కోనా కల్యాణచక్రవర్తి బైక్‌పై వెళ్తుండగా డొక్కు సురేంద్ర బైక్ రోడ్డుకు అడ్డుగా ఉండటంతో బైక్‌ను పక్కన పెట్టమన్నాడు. దీంతో ఆగ్రహించిన సురేంద్ర కల్యాణచక్రవర్తిపై దౌర్జన్యం చేశాడు. ఇది చూసిన కల్యాణచక్రవర్తి మిత్రుడు మారం భరద్వాజ్ గొడవను నివారించే యత్నం చేయగా సురేంద్ర, అతని సోదరుడు డొక్కు శివలు భరద్వాజ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులకు రూ. 25వేలు అందజేయాలి

ఉంగుటూరు: వరదల్లో నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు వరికి ఎకరానికి రూ. 25వేలు నష్టపరిహారం అందజేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం ఉంగుటూరు ప్రధాన కూడలి వద్ద నిర్వహించనున్న సదస్సులో రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇటీవల కృష్ణానది, బుడమేరు వాగుకు వరద పోటెత్తడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతాంగం పూర్తిగా నష్టపోయారని అన్నారు. విజయవాడ నగరంలో ప్రకటించిన విధంగానే గ్రామాల్లోని బాధితులకు పరిహారం అందజేయాలని పేర్కొన్నారు.

పంట నష్టపరిహారం పెంచాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: అధిక వర్షాలు, బుడమేరు వరదతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం ప్రకటించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు తోట సాంబశివరావు డిమాండ్ చేశారు. బాపులపాడు మండలం ఆరుగొలనులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేదీన హనుమాన్‌జంక్షన్‌లో రైతులు, కౌలుదారులతో భారీ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కోరం రవి, చింతా రాఘవయ్య, చలం పాల్గొన్నారు.

104 వాహన వైద్య సేవలు

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో శుక్రవారం 104 వాహన వైద్య సేవలను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామస్తులకు అందించారు. దీర్ఘకాల రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆహారపు అలవాట్లతో జీవనశైలి మార్చుకుని రోగాల బారిన పడకుండా ఉండాలని అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మేలు కలుగుతుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వివరించారు. 45 మందికి మందులు అందజేశారు. డాక్టర్ సంధ్యా, వైద్య సిబ్బంది సేవల్లో పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్, బజాజ్ ఆటోమొబైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.